క్లుప్తంగా

కళలకు, కళాకారులకు అండగా ప్రభుత్వం



ఎమ్మెల్యే నానిని కలిసిన కేవీ సత్యనారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళలను, కళాకారులను ప్రోత్సహించి అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో హిందూ యువజన సంఘం యాజమాన్య కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ నానిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని హిందూ యువజన సంఘం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని నాని హామీ ఇచ్చారు. సత్యనారాయణ సేవలను నాని ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఎంపీటీసీలకు ఓటరు కార్డుల అందజేత



ఏలూరు రూరల్: మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలకు మండల పరిషత్ సూపరింటెండెంట్ వై.సుజాత గురువారం ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందుకు వెళ్లిన ఎంపీటీసీలు పోలింగ్ భూత్‌లో ఎన్నికల అధికారికి ఈ గుర్తింపు చూపాలి. మరోపక్క జిల్లా అధికారులు ఏలూరు మండలపరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో పోలింగ్ నిర్వహణకు పోలింగ్‌బూత్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ స్టేషన్ సిద్ధం చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో 249 మంది ఓటర్లు ఉన్నట్టుగా అధికారులు నోటీసు బోర్డులో వెల్లడించారు. వీరిలో ఎంపీటీసీ, ఏలూరు నగర కార్పొరేషన్ కార్పొరేటలు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి సైతం ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ స్తంభాల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు తదితర పనులు నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శశిధర్ తెలిపారు. స్థానిక సీఆరార్ పబ్లిక్ స్కూల్ ప్రాంతం, శాంతి నగర్ మెయిన్ రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డు, జిల్లా పరిషత్ చైర్మన్ బంగ్లా రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం, రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై ఆగ్రహం

కేంద్రానికి వ్యతిరేకంగా నినదిస్తున్న నాయకులు



పాతబస్టాండ్‌లో తలపై గ్యాస్ బండలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ఫైర్‌స్టేషన్ సెంటరులో ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు తగ్గించాలంటూ గ్యాస్ సిలిండర్లను తలపై మోస్తూ స్థానిక పాతబస్టాండ్ సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్రం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 పెంచడాన్ని వ్యతిరేకించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్ ధర రూ.400 నుంచి రూ.1155, పెట్రోలు, డీజిల్ ధరలు రూ.50 నుంచి రూ.110కి పైబడి పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య మాట్లాడుతూ ధరల పెంపును ఆపకపోతే రానున్న కాలంలో ప్రజలే బీజేపీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీవీ రామకృష్ణ, నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాస్తారోకో

పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో ర్యాలీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడారు. మోదీ, అమిత్‌షాల ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రకాల వస్తువుల ధరలు పెంచారని వారు విమర్శించారు. ఒక పక్క సామాన్యుల ఆదాయం సరిపోక, కొనుగోలు శక్తి పడిపోతుండగా మరోపక్క ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యక్తుల ఆస్తులు లక్షల కోట్లు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు, యర్రా శ్రీనివాసరావు, డి.వీరనాయుడు, మంగం అప్పారావు, ఇఫ్టూ నాయకులు గడసాల రమణ, రాచీటి జాన్, మేకల రామయ్య, రంగాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లంగోళ్ల రంగారావు సేవలు మరువలేనివి



మల్లవరంలో రంగారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి కుటుంబీకులు

భీమడోలు: ఆర్థిక సంక్షోభంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మల్లవరం గ్రామ ప్రజలను ఆదుకున్న మహోన్నత వ్యక్తి దివంగత పిల్లంగోళ్ల రంగారావు అని వక్తలు కొనియాడారు. చెట్టున్నపాడు పంచాయతీ పరిధి మల్లవరంలో గ్రామస్తుల ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన ఏలూరు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఆర్‌ఆర్‌ఆర్ సంస్థల అధినేత దివంగత పిల్లంగోళ్ల రంగారావు విగ్రహాన్ని గురువారం ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తల్లి గిరి కుమారి ఆవిష్కరించారు. క్షీరాభిషేకం చేశారు. గజ దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లవరం గ్రామస్తులు మాట్లాడుతూ రామారావుకు తమ గ్రామానికి 50 ఏళ్ల అనుబంధం ఉందని, తమను అన్నివిధాలా ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు. పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ మల్లవరం ప్రజలు తన తండ్రి రంగారావు చేసిన మేలుకు గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, గ్రామస్తులకు రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఈడ్పుగంటి నవరాజు, ఈడ్పుగంటి హరిభగవన్, ఉక్కునూరి రమేష్‌బాబు, ఉక్కునూరి గోపాలకృష్ణ, ఏట్రించి గణేష్, పిల్లంగోళ్ల శ్రీదేవి, వైదేహీపూర్ణ, సువర్చల పావని, గ్రామ పెద్దలు ఆదినారాయణ, బోయిన కేదార్, ఈశ్వరుడు, కొండలయ్య, చంటి రాజు, కల్యాణరాజు, రామరాజు, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని పరామర్శలు



రవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాని



సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాని

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, అభిమానుల కుటుంబాలను ఎమ్మెల్యే ఆళ్ల నాని గురువారం పరామర్శించారు. 39వ డివిజన్ కార్పొరేటర్ కిలాడి జ్యోతి దుర్గారావు తల్లి బొమ్మి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. మారుతీ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీతమ్మ చిత్రపటానికి నాని పూలమాల వేసి నివాళులర్పించారు. 3వ డివిజన్‌లోని కాపుదాసి రవి తండ్రి జయంతరావు ఇటీవల చెందారు. నవాబ్ పేట కాలనీలో జరిగిన కార్యక్రమంలో జయంతరావు చిత్రపటానికి ఎమ్మెల్యే నాని పూలమాల వేసి నివాళులర్పించారు. బోడా కిరణ్ బావ శంకా శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. సత్యనారాయణ పేటలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద్‌రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా ఎమ్మెల్యే నాని



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రమాదవశాత్తు గాయపడి మంచానికి పరిమితమైన మహిళకు ఎమ్మెల్యే ఆళ్ల నాని అండగా నిలిచారు. గురువారం స్థానిక 3వ డివిజన్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నాని పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ ద్వారా విషయం తెలుసుకుని మంచానపడిన మండా చైతన్య సుమను కలిశారు. దివ్యాంగుల కోటాలో పింఛన్ అందుతుందని బాధితురాలి కుటుంబం తెలిపింది. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. దీంతో న్యూరో సర్జన్ బాధితురాలి ఆరోగ్యపరిస్థితిని పరిశీలించారు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆమెకు ప్రభుత్వం తరఫున నిర్మాణం పూర్తయిన ఇంటిని అప్పగించాలని నాని సూచించారు.

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్దన, రంగనాయక స్వామి వార్ల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి జనార్దన స్వామి సుప్రభాత గోష్ఠి, సభ్యులచే సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవా కాలం, ఆరగింపు, మంగళశాసనాలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. శ్రీవారికి, తాయార్లకు క్షీరతిరు మంజనం, స్వామి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం అర్చన, హోమాలు, సేవాకాలం, ఆరగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైవీ రావు పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం



నివాళులర్పిస్తున్న బొప్పరాజు, తదితరులు

ఏలూరు (టూటౌన్) : ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి మాజీ ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వైవీ రావు చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో గురువారం నిర్వహించిన వైవీ రావు సంతాప సభలో బొప్పరాజు మాట్లాడుతూ వైవీ రావు మృతి ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు తీరనిలోటని పేర్కొన్నారు. సభలో ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎన్ఎంయూ, ఎన్జీవో నాయకులు పలిశెట్టి దామోదర్, బండి వెంకటేశ్వరరావు, వీరయ్య నాయుడు, డి.రాంబాబు, అల్లం నారాయణ, ఎండీ ఆలీ, సుందరయ్య, కె.రమేష్, సీహెచ్ హరినాథ్, చోడగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య వర్క్‌షాప్ తొలగించాలి

ఏలూరు రూరల్: జనవాసాల మధ్య ఆర్‌కే వర్క్‌షాప్ తొలగించాలని ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామస్తుడు ఈపిచర్ల నాగాంజనేయులు జిల్లా పంచాయతీ అధికారులను కోరారు. గురువారం ఏలూరులో డీపీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. కొన్నేళ్ల క్రితం చేబ్రోలు ఐటీఐ కళాశాల రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాపు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, డీపీఓ, పొల్యూషన్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయగా 2020 సెప్టెంబర్ 23న వర్క్‌షాప్‌ను సీజ్ చేశారని వివరించారు. యజమానులు పంచాయతీ అనుమతితో వర్క్‌షాప్‌ను పునఃప్రారంభించారని తెలిపారు. దీనిపై గత ఏడాది ఆగస్టు 20న స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వర్క్‌షాప్ పరిశీలించి పొల్యూషన్ రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా ఫలితంలేదని పేర్కొన్నారు.

క్రేయా-23 వేడుకలు ప్రారంభం



క్రేయా - 23 వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు



సైన్స్ ఎక్స్‌పోను పరిశీలిస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో క్రేయా - 23 మూడు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ప్రారంభించిన రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎ.ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్య ఆవశ్యకత తెలుసుకుని, నూతన సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. తొలి రోజు నిర్వహించిన పలు పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. వేడుకల్లో కళాశాల కార్యదర్శి కె.వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సాయి రోహిత్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ ఆదేశించారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారి (అనాధలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు) కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్టు చెప్పారు. జిల్లాలో ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరించే ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత గల పిల్లలకు 1వ తరగతి విద్యార్థుల నమోదులో 25 శాతం సీట్లు కేటాయించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన 2023-24 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశం కల్పించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రవేశాల సమయంలో తమ సందేహాలు నివృత్తి చేసుకోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ 14417కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. బాలల హక్కు చట్టం 2009లో 12 (1)(సీ) అమలుకు సంబంధించి అన్‌లైన్‌లో ఈ నెల 6 నుంచి ఆగస్టు 28 వరకు దరఖాస్తు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ సీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

రేపు స్టేట్ బ్యాంక్‌లో మెగా వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 4న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు విజయవాడకు చెందిన ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. బ్యాంక్ సిబ్బంది కుటుంబాలకు, వినియోగదారులకు బీపీ, షుగర్, ఎముకల అరుగుదల పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

లేగదూడల అందాల పోటీలు

దెందులూరు: మండలంలోని కొత్తగూడెం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ (తాడేపల్లిగూడెం) ఆధ్వర్యంలో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. దీనికి అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనకు వివిధ మండలాల నుంచి 40 లేగదూడలు వచ్చాయని దెందులూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు.

గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య నిపుణుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్, సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక అశోక్ నగర్‌లోని అశోక వర్ధని పాఠశాలలో గురువారం గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 24 మంది పిల్లలు హాజరయ్యారని, వారికి హైదరాబాద్‌లో త్వరలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయ కర్త, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

విక్టర్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలపై హర్షం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు అదనంగా రాష్ట్ర సఫాయి కార్మికుల సంక్షేమం, పరిరక్షణ బాధ్యతలు అప్పగించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జాతీయ ఎస్సీ నాయకులు పాలిమేర హరికృష్ణ అభినందనలు తెలిపారు. స్థానిక గన్‌బజార్ సెంటరులోని సంఘ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన ఎస్సీ ముఖ్య నాయకులు, సఫాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ ఆశయ సాధనకు విక్టర్ ప్రసాద్ పనిచేస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు పాకా ప్రభాకరరావు, మందపాటి నవీన్, గూడవల్లి శ్రీనివాస్, సఫాయి కార్మికులు మేతర పెద్దిరాజు, కరపాతి శ్రీనివాస్, కటారి నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిసత్ సర్వసభ్య సమావేశం 30 నిమషాల్లో ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనుసరించి కొత్త తీర్మానాలు చేయరాదన్నారు. రాబోయే సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు సమస్యల పరిష్కారంపై సభ్యులు దృష్టి పెట్టాలని ఎంపీపీ అన్నారు. ఎంపీటీసీలు గుత్తా గంగాభవాని, కాకర్ల తంబి, నరహరశెట్టి నాగమణి, గండికోట నాగరాజు, ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి, ట్రాన్స్‌కో, పీఆర్ ఇంజినీర్లు శ్రీనివాస్, కృష్ణమోహన్, మండల వ్యవసాయ అధికారిణి జీవన సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	10-12
బెండకాయలు	48	కంద	40
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	34
కాకర కాయలు	34-36	కీరా దోస	46
బీరకాయలు	44-58	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	58	అల్లం	70
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	38	చుక్కకూర	08
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28-40	బఠాణి	56
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	33